ఈనాడు జగిత్యాల
బుధవారం అక్టోబరు 23, 2024 5

కొండగట్టులో భక్తుల రద్దీ



మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం మంగళవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అయిదుగురు ఏఈవోల సస్పెన్షన్

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: జిల్లాలో పని చేస్తున్న అయిదుగురు వ్యవసాయ విస్తరణ అధికారులను వ్యవసాయశాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టని చాలామంది ఏఈవోలను మంగళవారం సస్పెండ్ చేయగా ఇందులో జిల్లాకు చెందిన అయిదుగురు ఉన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా కేంద్ర ప్రభుత్వ డిజిటల్ సర్వేను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని.. రైతు వేదికల్లో సదుపాయాలు కల్పించాలని.. ఏఈవోల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని.. ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఏఈవోల సంఘం జిల్లా నాయకులు సురేందర్ నాయక్, శ్రీనివాస్, భూమేశ్వర్, గంగాధర్ తదితరులు కోరారు. టీఎన్జీవోల అధ్యక్ష కార్యదర్శులు బోగ శశిధర్, నాగేందర్ రెడ్డిలతో కలిసి ఈ మేరకు జగిత్యాలలో జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు.

దుమారం రేపిన హత్య

- ఘటనను నిరసిస్తూ రహదారిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బైఠాయింపు
- జగిత్యాలలో 4 గంటలపాటు ఆందోళన

న్యూస్‌టుడే, జగిత్యాల, జగిత్యాల గ్రామీణం



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, జగిత్యాల గ్రామీణ మండలం జాబితాపూర్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు మారు గంగారెడ్డి హత్య పెను దుమారం లేపింది. గంగారెడ్డి హత్యకు వ్యక్తిగత కక్షలు ఉన్నప్పటికీ రాజకీయ రంగు పులుముకోవడంతో జగిత్యాలలో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం ఉదయం 8 గంటలకు జాబితాపూర్ గ్రామంలో గంగారెడ్డి అత్యంత దారుణంగా హత్యకు గురికాగా మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తేగానే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. సుమారు 4 గంటలపాటు పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఒక దశలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తీవ్ర అసహనానికి గురయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పార్టీ కోసం కష్టపడ్డ వారికి అవమానాలే మిగులుతున్నాయని ఆవేదన చెందారు. పార్టీ ఫిరాయించిన వ్యక్తి ప్రోద్బలంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పోలీసులు, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లేందుకు వారు సిద్ధపడగా పోలీసులు అడ్డుకున్నారు. జీవన్‌రెడ్డి సైతం కార్యకర్తలను నిలువరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా జీవన్‌రెడ్డి ఓటమి చెందారు. భారాస నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరారు. ఆ సమయంలోనే తీవ్ర నిరాశ చెందిన జీవన్‌రెడ్డిని అధిష్ఠానం బుజ్జగించింది. ఇద్దరు నేతలు విడివిడిగానే కార్యక్రమాల్లో పాల్గొంటుండగా ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో సైతం అయోమయం నెలకొంది. జగిత్యాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మారు గంగారెడ్డి పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మరో పేరు ప్రతిపాదించడంతో పాలకవర్గం నియామకం పెండింగ్‌లో పడినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇందిరమ్మ కమిటీల్లో సభ్యుల పేర్ల విషయంలోనూ ఇదే తీరు ఉందని వారు పేర్కొంటున్నారు. ఏళ్ల నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారి పేర్లు కాకుండా భారాసకు చెందిన వారి పేర్లను ఎమ్మెల్యే ప్రతిపాదిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. తాజాగా గత ఎన్నికల సమయంలో భారాసలో పని చేసిన యువకుడు గంగారెడ్డిని హతమార్చడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. గంగారెడ్డి హత్య నేపథ్యంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆందోళనకు దిగగా, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పార్టీ శ్రేణులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గంగారెడ్డి హత్యను విప్ లక్ష్మణ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని అండగా ఉంటానన్నారు. గంగారెడ్డి హత్యను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఖండించారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



రోడ్డుపై బైఠాయించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్

హతమార్చి.. లొంగిపోయి

గంగారెడ్డి హత్య కేసులో నిందితుడు సంతోష్ ఘటన తరవాత నేరుగా జగిత్యాల గ్రామీణ ఠాణాకు వెళ్లి లొంగిపోయాడు. అతన్ని పోలీసులు విచారిస్తున్నారు. పలు విషయాల్లో అడ్డు తగలడంతో ఈ చర్యకు పాల్పడ్డట్లు పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. కాగా నిందితుడు లొంగిపోగానే సామాజిక మాధ్యమాల్లో సంతోష్ జగిత్యాల గ్రామీణ పోలీసుస్టేషన్‌లో చిత్రీకరించిన ఓ పాత వీడియో వైరల్‌గా మారడంతో కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.

ఆందోళనలోనూ దేశభక్తిని మరవక...

గంగారెడ్డి హత్యను నిరసిస్తూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో సహా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాత బస్టాండ్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగగా అదే సమయంలో ఉదయం 9.30 గంటలకు నిత్య జనగణమన గీతం మైకులో వినిపించగా ఆందోళన చేస్తున్న వారంతా లేచి నిలబడి వందనం చేస్తూ దేశభక్తిని చాటుకున్నారు.

నష్టం అంచనాలను త్వరితగతిన రూపొందించాలి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి విస్తరణలో కోల్పోతున్న కట్టడాలు, చెట్లు, పైపులైన్లు, బోర్లు తదితర వాటిని పరిశీలించి నష్టం అంచనాలను త్వరితగతిన రూపొందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మెట్‌పల్లి మండలం చెర్లకొండాపూర్ వడ్డెర కాలనీ వద్ద మంగళవారం జాతీయ రహదారుల సంస్థ ప్రతినిధులు, అధికారులకు భూసేకరణకు సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు. వడ్డెర కాలనీ వద్ద కొన్ని కట్టడాలు భూసేకరణలో పోతున్నాయని స్థానిక అధికారులు ఆయనకు తెలిపారు. భూసేకరణకు వీలుగా నష్టం అంచనాల రూపకల్పనలో ఎన్‌హెచ్‌ఏఐతో కలిసి ఆయా శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఇది వరకు చేసిన సర్వేలో వెల్లడించిన వివరాలపై భూనిర్వాసితులు తెలిపిన అభ్యంతరాలను మరోసారి పరిశీలించాలని చెప్పారు. భూసేకరణకు అవసరమైన పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, జాతీయ రహదారుల ప్రతినిధులు, ఆర్ఐ ఉమేశ్ తదితరులున్నారు.



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

మౌలిక వసతులు కల్పించండి

మేడిపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం మేడిపల్లి మండలం కాచారం, బీమారం మండలం దేశాయిపేట, గోవిందారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యత ప్రమాణాలతో ధాన్యం తరలించాలని రైతులకు సూచించారు. డీఆర్డీవో మదన్ మోహన్, అడిషనల్ డీఆర్డీవో చరణ్‌దాస్, డీఎం జితేందర్, డీసీఎస్‌వో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ వసంత, ఎంపీడీవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

బీటులో 8 వేల క్వింటాళ్ల మక్కల కొనుగోలు

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు మంగళవారం పెద్దఎత్తున మక్కలను విక్రయానికి తేగా బీటులో వ్యాపారులు 8,082 క్వింటాళ్ల మక్కలను కొనుగోలు చేశారు. బీటులో మక్కలకు కనిష్ఠ ధర క్వింటాకు రూ.1,850, గరిష్ఠ ధర రూ.2,415 చొప్పున పలికినట్లు మార్కెట్ కార్యదర్శి టి.రాజశేఖర్ తెలిపారు. 480 క్వింటాళ్ల ఎంటీయూ- 1010 రకం ధాన్యాన్ని తీసుకురాగా క్వింటాకు రూ.1,868 నుంచి రూ.1,920 వరకు ధరలు పలికినట్లు పేర్కొన్నారు.

31 ధాన్యం కేంద్రాల ప్రారంభం

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: వానాకాలం ధాన్యం సేకరణకుగాను జిల్లాలో మంగళవారం వరకు 21 ఐకేపీ కేంద్రాలు, 10 ప్యాక్స్ కేంద్రాలను ప్రారంభించినట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు. ధాన్యంలో తేమ శాతం, నాణ్యతనుబట్టి కొనుగోలు, తూకం మొదలవుతుందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ వరి కోతలు మొదలై కళ్లాలకు ధాన్యం రాకనుబట్టి మిగిలిన అన్ని కేంద్రాలను ప్రారంభిస్తారని తెలిపారు.

జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ




కథలాపూర్ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీహెచ్‌ఎంవో

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఎండీ షమియోద్దీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, మందుల నిల్వలను పరిశీలించారు. గ్రామాల్లో కాలానుగుణ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్‌లు వేయాలని సూచించారు. డా.సింధూజ, సూపర్‌వైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

సాగునీటి సమస్యలకు చెక్!

న్యూస్‌టుడే, ధర్మపురి



అస్తవ్యస్తంగా జైన ఎస్సారెస్పీ చివరి కాలువ

ఏళ్ల తరబడి సాగునీటి రంగంలో క్షేత్రస్థాయి సిబ్బంది లేక చివరి ఆయకట్టుకు నీరందించడం గగనంగా మారింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టాలని భావిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటనతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఓ వైపు జిల్లాలో గోదావరి ఎత్తిపోతల పథకాలు, రోళ్లవాగు ప్రాజెక్టు, అక్కపల్లి చెరువు రిజర్వాయర్, బోలిచెరువు, జంగనాల ప్రాజెక్టు, యశ్వంతరావుపేట ప్రాజెక్టు లాంటివి ఉండటం.. మరోవైపు డీ-53, డీ-86 ప్రధాన కాలువలు ఉన్నాయి. వీటి కింద లక్ష ఎకరాల వరకు ఆయకట్టు ఉంది.

పిచ్చి మొక్కలతో కాలువలు

కాలువల ద్వారా నీటిని వదిలిన సమయంలో అవి పూడికతో, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో ఏటా చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. గోదావరి ఎత్తిపోతల పథకాలు నూతనంగా నిర్మించడంతో వీటి కింద 20 వేల ఆయకట్టు పెరిగింది. ఈ పథకాలకు క్షేత్రస్థాయి సహాయ సిబ్బంది లేక నిర్వహణకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా రైతులు సమష్టిగా పథకాలను బాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నూతన నియామక ప్రక్రియ రైతులకు దోహద పడనుంది.

సిబ్బంది నియామకానికి పచ్చజెండా

120 మందితో ప్రతిపాదనలు

గోదావరి ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లకు ఎంతమంది ఎలక్ట్రిషియన్లు, ఫిట్టర్లు, పంపు మెకానిక్‌లు అవసరమో ప్రతిపాదించాలని ప్రభుత్వం ఇటీవల ఇరిగేషన్ అధికారులకు లేఖలు ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ద్వారా పంపించింది. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో అన్ని పథకాలకు కలిపి 120 మంది వరకు అవసరం ఉంటారని నివేదించారు.

ప్రకటనతో అన్నదాతల హర్షం

ప్రభుత్వం 22 జులై 2016న నీటిపారుదల శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుంటే ప్రధాన కాలువపై ప్రతి 9 కి.మీ.కి ఒకరు, ఉప కాలువపై ప్రతి 112 కి.మీల వరకు మరొకరు, డిస్ట్రిబ్యూటర్‌పై ప్రతి 2,500 ఎకరాల ఆయకట్టుకు లస్కర్లు ఉండాల్సి ఉండగా అమలు కావడం లేదు. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన, ప్రభుత్వం ప్రతిపాదనలను కోరడం నీటి పారుదల నిర్వహణలో నెలకొన్న దశాబ్దాల సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు.

ఆదేశాలకు అనుగుణంగా చర్యలు

సాగునీటి రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు వేస్తుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొత్తగా లస్కర్లు, సహాయకుల నియామక ప్రక్రియకు సంబంధించిన ప్రతిపాదలను ప్రభుత్వానికి నివేదించాం. వీరిని నియమిస్తే సాగునీటి సరఫరా సమస్యలు చాలా వరకు తగ్గే అవకాశముంది.

-నారాయణరెడ్డి, ఇరిగేషన్ డీఈ, ధర్మపురి డివిజన్

జిల్లాకు తేలికపాటి వర్ష సూచన

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: రాగల అయిదు రోజుల్లో జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి వర్షసూచన ఉందని పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. గాలిలో తేమ 41-90 శాతం, ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 21-23, గరిష్ఠంగా 33-34 డిగ్రీల సెల్సియస్ వరకు నెలకొంటాయని పేర్కొన్నారు.

పల్లె రహదారి.. అధ్వానంగా మారి



ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట నుంచి తుమ్మెనాలకు వెళ్లే 4 కి.మీల ప్రధాన రహదారి గుంతలమయం అయింది. దీంతో రాత్రిళ్లు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలుచోట్ల పూర్తిగా దెబ్బతింది. దూరభారం తగ్గుతుందనే నేపథ్యంలో నక్కలపేట, దోనూర్ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తుమ్మెనాల మీదుగా జగిత్యాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతారు. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ధర్మపురి



కలెక్టరేట్ ఎదుట ధర్నా

జగిత్యాల, న్యూస్‌టుడే: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జగిత్యాల కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అంతకుముందు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల కారణంగా కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కార్యదర్శి అక్రం మాలిక్, ఉపాధ్యక్షులు బచ్చల రమేశ్, మచ్చ నితీన్, మంద రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొన్నారు.. మూలన పెట్టారు

చెత్త సేకరణ వాహనాల వినియోగంలో బల్దియా నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, జగిత్యాల పట్టణం

రోజు సేకరించే చెత్త : 70 మెట్రిక్ టన్నులు

- వార్డులు : 48
- ఆటోలు : 46
- ట్రాక్టర్లు : 12
- టిప్పర్ : 1
- డోసర్ : 1
- జేసీబీ : 1
- డంపర్ పేసర్ : 1
- వైకుంఠరథం : 1
- బ్లేడ్ ట్రాక్టర్లు : 2
- పనిచేయని ఆటోలు 15

జగిత్యాల పట్టణంలో 48 వార్డుల నుంచి నిత్యం 70 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. వార్డుల విలీనం తరువాత గృహాల సంఖ్య పెరగటం, కాలనీలను విస్తరించడంతో చెత్త సేకరణ బల్దియాకు సవాలుగా మారింది. వాహనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆటోలు, ట్రాక్టర్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో బల్దియా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో ఏడాది క్రితం ట్రాక్టరును.. రెండు నెలల కింద రూ.25 లక్షలతో 4 కొత్త ఆటోలను కొనుగోలు చేశారు. వీటిని వెంటనే ప్రారంభించి వినియోగించాల్సిన అవసరం ఉన్నా.. నిర్లక్ష్యంతో పక్కన పెట్టేశారు.

మరమ్మతులపైనే శ్రద్ధ

పురపాలిక అధికారులకు మరమ్మతులపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికి రూ.20 లక్షల చొప్పున మరమ్మతులకు వ్యయం చేస్తున్నారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనే డిమాండ్ రెండేళ్లుగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటం. . సభ్యుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొత్త వాహనాలు కొనుగోలు చేసినా మరమ్మతుల యావలోపడి వీటి నిర్వహణ మరిచారు. ప్రస్తుతం 15 ఆటోలు మరమ్మతు కోసం నెలల తరబడి మెకానిక్ షెడ్లలో మగ్గుతున్నాయి. తరచూ కమిషనర్లు మారటం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు సిబ్బంది మరమ్మతుల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.



ఈ చిత్రంలో ముసుగుకప్పి కనిపిస్తుంది కొత్త ట్రాక్టరు. చెత్త సేకరణ కోసం రూ.14 లక్షలు వెచ్చించి బల్దియా ఏడాది కిందట దీన్ని కొనుగోలు చేసింది. షోరూం నుంచి తెచ్చి విద్యానగర్ నీళ్ల ట్యాంకు వద్ద చెట్టుకింద ఇలా నిలిపారు. పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో సంవత్సరం నుంచి వినియోగానికి దూరమై తుప్పుపడుతోంది.



ఇక్కడ కనిపిస్తున్న 4 కొత్త ఆటోలను రూ.25 లక్షల వ్యయం చేసి బల్దియా 2 నెలల కిందట కొనుగోలు చేసింది. ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్ పూర్తయినా 2 నెలలుగా విద్యానగర్ నీళ్ల ట్యాంకు వద్దే ఉంచారు. పట్టణంలో ఓవైపు చెత్త సేకరణ లేక కాలనీలు కంపు కొడుతుంటే కొనుగోలు చేసిన వాహనాలను పక్కనపెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.



స్థానిక 45వ వార్డులో పారిశుద్ధ్య సిబ్బంది వారం రోజులుగా చెత్త తొలగించలేదు. దసరా పండగపూట కాలనీవాసులు దుర్గంధంతో విసిగిపోయారు. కారణమేంటని కాలనీవాసులు ఆరా తీస్తే ఈ వార్డుకు చెందిన వాహనం 2 నెలలుగా మరమ్మతులో ఉందని పురపాలక సిబ్బంది తెలిపారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసినా వార్డులకు కేటాయించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

- వాహనాలు పాడైపోయాయని.. కొత్త వాహనాలు లేవనే కారణాలతో పారిశుద్ధ్య సిబ్బంది వార్డుల్లో చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించడం లేదు.
- మొరాయిస్తున్న వాహనాలతోనే సామర్థ్యానికి మించి చెత్త సేకరిస్తున్నామని కొందరు పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు.
- వార్డుల్లో కనీసం వారం రోజులకోసారి కూడా చెత్త సేకరణ చేపట్టకపోవడంతో పలు కాలనీల్లో దుర్గంధం వ్యాపిస్తోంది.
- తీవ్రమైన జ్వరాల బారిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు కనీసం దోమల నివారణ మందు కూడా చల్లడం లేదు.
- సమస్యల పరిష్కారానికి పురపాలిక సభ్యులు స్పందించాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

చెంజర్ల గడ్డ.. ఉద్యోగుల అడ్డా

- ☛ ఒకే ఊరిలో 70 మంది ఉపాధ్యాయులు
- ☛ ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం

గతంలో కరవు కాటకాలతో సతమతమైన గ్రామం అది. ప్రస్తుతం గురువులకు నిలయంగా మారింది. తలాపున కాకతీయ కాలువ ప్రవహిస్తున్నా ఆ పల్లెకు చుక్క నీరు అందడం లేదు. సాధారణ కుటుంబాలు కావడంతో చదువుతోనే భవిష్యత్తు బాగుపడుతుందని పెద్దలు తలచారు. ముందుగా ఆరుగురు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వారి స్ఫూర్తితో అదే ఉద్యోగాన్ని సాధించాలని మరికొంత మంది దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. ప్రస్తుతం ఒక తరాన్ని ప్రభావితం చేయగలిగిన గురువులు ఈ ఊరి సొంతం. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 70 మంది ఉపాధ్యాయులు ఆ గ్రామంలో ఉండడం విశేషం.

- న్యూస్‌టుడే, మానకొండూర్


చెంజర్ల గ్రామం

మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామంలో 3,067 మంది జనాభా ఉంది. నీటి సదుపాయం లేకపోవడంతో ఆశించిన మేర వ్యవసాయం సాగలేదు. దీంతో పలు కుటుంబాలు జీవనోపాధి కోసం ముంబయి, భీవండి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ క్రమంలోనే తమ భవిష్యత్తుపై ఆందోళన చెందిన స్థానిక యువత.. చదువుపై దృష్టి సారించింది. మొక్కవోని దీక్షతో.. ఉజ్వల భవిష్యత్తుపై ఆశతో.. ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువులు కొనసాగించారు. 2006 డీఎస్సీలో గ్రామం నుంచి ఒక్కసారే ఆరుగురు ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. ఈ పరిణామం గ్రామంలోని పలువురిని ఉపాధ్యాయ వృత్తి వైపు మళ్లించేలా చేసింది. వారి ఆసక్తికి.. స్థానిక ప్రైవేట్ ఉపాధ్యాయుడు ఆంజనేయులు, మార్కండేయ, శ్రీనివాస్‌ల ప్రోత్సాహం తోడైంది. వారు ఇచ్చిన సూచనలను సద్వినియోగం చేసుకున్న 18 మంది అభ్యర్థులు 2012 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికై అరుదైన ఘనత సాధించారు. ఒకే గ్రామం నుంచి అంత మంది ఉద్యోగానికి ఎంపికైన దాఖలాలు రాష్ట్ర చరిత్రలోనే లేవు. అదే స్ఫూర్తితో ప్రతీసారి ఈ గ్రామం నుంచి ఉపాధ్యాయులుగా ఎంపిక అవుతూనే ఉన్నారు. తాజా డీఎస్సీలోనూ ఒక్క పీఈటీ, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ఆరుగురు ఎస్జీటీలు ఎంపికవడం గమనార్హం. వీరితోపాటు గ్రామంలో 17 మంది కానిస్టేబుళ్లతోసహా ఇతర విభాగాల్లోనూ ఉద్యోగులు ఉండటం విశేషం.

వృత్తిపై మమకారం



ప్రాథమిక విద్య నుంచే ఉపాధ్యాయ వృత్తిపై మమకారం పెరిగింది. ఉపాధ్యాయుడిగా ఎంపికై పలువురిని ప్రయోజకులుగా తయారు చేయాలని ఉండేది. 2012 టెట్‌లో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంకు సాధించాను. స్కూల్ అసిస్టెంటుగా ఎంపిక కావడం ఎంతో సంతోషం కలిగించింది. ఇటీవల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఆంగ్ల అధ్యాపకుడిగా ఎంపికయ్యాను. టీటీసీ తరగతులు నిర్వహిస్తూ ఉపాధ్యాయ వృత్తిలోకి ఎంపికయ్యేలా సహాయం చేస్తున్నాను.

- బైరి మార్కండేయ, జూనియర్ లెక్చరర్

సీనియర్ల స్ఫూర్తితో..



సీనియర్ ఉపాధ్యాయుల స్ఫూర్తితో నేను కూడా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివాను. బీఈడీ పూర్తి చేసి అనుకున్నది సాధించాను. కొన్నాళ్లపాటు మా గ్రామంలోని ఉన్నత పాఠశాలలోనే పని చేయడం ఎంతో సంతృప్తిని కలిగించింది. నా భార్య కూడా ఉపాధ్యాయురాలే. ఎవరైనా ఏదైనా అనుకుంటే అది సాధించే వరకూ ప్రయత్నిస్తూ ముందుకు సాగాలి.

- దాసరి శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్

మొదటి ప్రయత్నంలోనే..



నేను మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవడానికి కారణం మా గ్రామమే. ఇంత మంది గురువులను చూసి అందులో నేనూ ఒకడిని కావాలని అనుకొని ఆ దిశగా ప్రయత్నం చేశాను. ఆత్మవిశ్వాసం కోల్పోయిన ప్రతీసారి నన్ను స్నేహితులు ప్రోత్సహించారు. చివరకు ఇటీవలి ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికవడం సంతోషాన్నిచ్చింది.

- బుర్ర శ్రీనివాస్, ఎస్జీటీ

గ్రామంలో ఉద్యోగుల సంఖ్య ఇలా..

- ★ మొత్తం ఉపాధ్యాయులు 70 (వీరిలో అయిదుగురు విశ్రాంత ఉపాధ్యాయులుండగా.. మరో ఇద్దరు చనిపోయారు.)
- ★ కానిస్టేబుళ్లు 17 ★ ఆర్టీసీ కండక్టర్లు 5 ★ పంచాయతీ కార్యదర్శులు 3 ★ సింగరేణి సంస్థలో.. 3 ★ జూనియర్ అసిస్టెంట్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ 2
- ★ టెక్నికల్ అసిస్టెంట్, ఐఐటీ మద్రాస్ 1 ★ ట్రాన్స్‌కో ఏడీఈ (అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్) 1 ★ ఆర్ఐ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ 1 ★ పోస్ట్‌మెన్ 1
- ★ జూనియర్ అసిస్టెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ 1 ★ జూనియర్ అసిస్టెంట్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్ 1 ★ ఆర్టీసీ మెకానిక్ 1

అమ్మ భాషలో ఆణిముత్యాలు

తెలుగులో డాక్టరేట్ సాధించిన అక్కాచెల్లెళ్లు

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం


శ్రీనివాస్‌తో కుమార్తెలు శరణ్య, హర్షిత

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీలేదని నిరూపిస్తున్నారు ఈ అక్కాచెల్లెళ్లు. తండ్రి ఆశయం మేరకు తెలుగుపై మక్కువ పెంచుకున్న వీరు ఒకేసారి డాక్టరేట్ సాధించి ప్రశంసలు అందుకుంటున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని బుక్కవాడకు చెందిన వైద్యుడు వేముల శ్రీనివాస్-సాయిసుధ దంపతుల కుమార్తెలు శరణ్య, హర్షితకు చిన్నప్పటి నుంచే తెలుగు భాషపై మక్కువ. హైదరాబాద్‌లోని కేంద్రియ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు టాపర్స్‌గా నిలిచి శరణ్య, హర్షిత బంగారు పతకాలు సాధించారు. ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా తెలుగులో ఒకేసారి డాక్టరేట్ అందుకున్నారు. డిగ్రీ కళాశాల అధ్యాపకురాళ్లుగా ఒకేసారి ఉద్యోగాలు సాధించిన వీరు ప్రొఫెసర్లు కావడమే తమ లక్ష్యమంటున్నారు.

■ శరణ్య 1 నుంచి 10వ తరగతి వరకు మెట్‌పల్లిలో, ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివి 5 ఏళ్ల పాటు మొదటి ర్యాంకు సాధించారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో మొదటి స్థానం సాధించి మెరిట్ బంగారు పతకం, డిగ్రీ స్థాయిలో సంస్కృతంలో అత్యధిక మార్కులు పొంది రెండో బంగారు పతకం సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో నాలుగు సెమిస్టర్లలో మొదటి స్థానంలో నిలిచి విశ్వవిద్యాలయం పరిధిలో ఉమెన్ టాపర్‌గా నిలిచి 2013లో అప్పటి గవర్నర్ చేతుల మీదుగా మెరిట్ బంగారు పతకం అందుకున్నారు. తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రి రాములు వద్ద శ్రీనాథుని కవితా ప్రస్థానం సమగ్ర పరిశీలన అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేయడంతోపాటు కవితలు, పాటలు రాసి అవార్డులు అందుకున్నారు. పలు టీవీ ఛానళ్లలో తెలుగుపై చర్చా కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. 2019లో గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించిన ఆమె ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా తెలుగులో డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

■ హర్షిత 10వ తరగతి వరకు మెట్‌పల్లిలో చదివి మండల టాపర్‌గా నిలిచి ఐఐఐటీ బాసరలో సీటు సాధించారు. తెలుగు భాషపై మక్కువతో ఐఐఐటీ సీటును వదిలేసి అక్క నడిచిన మార్గంలోనే ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివి టాపర్‌గా నిలిచారు. హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో నాలుగు సెమిస్టర్లలో టాపర్‌గా నిలిచి 2016లో మూడు మెరిట్ మెడల్స్‌ని కైవసం చేసుకున్నారు. ఇదే విశ్వవిద్యాలయంలో సాహిత్య వ్యాసాలు విమర్శనాత్మక అధ్యయనం అనే అంశంపై ఆచార్య దార్ల వేంకటేశ్వరరావు వద్ద పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2019లో తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించిన ఆమె తాజాగా తెలుగులో గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా తీసుకున్నారు.

ఆర్టీఏలో పొరుగు సేవల సిబ్బందిపై వేటు

న్యూస్‌టుడే - కరీంనగర్ రవాణావిభాగం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రవాణా శాఖ కార్యాలయాల్లో పని చేసే కొందరు డీబీఏలపై (డాటా బేస్డ్ ఎంట్రీ ఆపరేటర్స్, ప్రస్తుతం వీరిని టెక్నికల్స్ సపోర్ట్ ఇంజినీర్స్ అని పిలుస్తున్నారు) వేటుకు రంగం సిద్ధమైంది. కొన్నేళ్లుగా ఆర్టీఏ కార్యాలయాల్లో పని చేసే ఈ సిబ్బందిపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో దశల వారీగా వీరికి ఉద్వాసన పలకాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది.

వీరిది కీలకపాత్ర...

రవాణా శాఖ కార్యాలయాల్లో అవుట్‌సోర్సింగ్ ద్వారా నియామకమైన డీబీఏలు కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. ఆ శాఖకు సంబంధించిన సమాచారాన్ని కంప్యూటర్లలో నిక్షిప్తం చేయడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల ముద్రణ తదితర పనులు వీరే చూసుకుంటున్నారు. కొన్ని కార్యాలయాల్లో అధికారులు లేకపోయినా పనులు చక్కబెడుతున్నారు. ఈక్రమంలో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆరోపణలు వచ్చిన వారిని తొలగించాలని సర్కారు నిర్ణయించింది. కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో పనిచేసే మురళీకృష్ణపై వేటుపడింది. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఉమ్మడి జిల్లా ఉప రవాణా కమిషనర్ పెద్దింటి పురుషోత్తంను వివరణ కోరగా నిజమేనని ధ్రువీకరించారు.

అందరిలో ఆందోళన..

ఉమ్మడి జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందిలో ఎప్పుడు ఎవరిపై వేటు పడుతుందోననే భయాందోళనలో ఉన్నారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఇటీవలే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కూడా కలిసి డీబీఏ ఉద్యోగులు విన్నవించినట్లు తెలిసింది.

సన్నాల కొనుగోళ్లలో నూతన విధానానికి శ్రీకారం

నిబంధనలకు లోబడి ఉంటేనే ధాన్యానికి రూ.500 బోనస్

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్


గ్రెయిన్ కాలిపర్ పరికరం

రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 ఇస్తామని ప్రకటించడంతో ధాన్యం సేకరణ నాణ్యత, నిర్ధారణలో నిబంధనలు కఠినతరం చేసింది. పొరపాట్లు జరగకుండా సన్న రకాలను కొనుగోలు చేసేందుకు తొలిసారిగా సాంకేతిక విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్షేత్రంలోకి దిగిన అధికార యంత్రాంగం రైతులను చైతన్యం చేసే పనిలో నిమగ్నమైంది

ప్రత్యేక పరికరంతో పరిశీలన

ధాన్యం నాణ్యత విషయంలో పౌరసరఫరాల శాఖ ఇప్పటి వరకు దొడ్డు, సన్న నిర్ధారణ ప్రమాణాలు పాటించకుండానే వడ్లను కొనుగోలు చేస్తోంది. ఏఈవోలు 'ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ' పరికరంతో దొడ్డు, సన్న రకాలు గుర్తించకుండా తేమ, తాలు, రాళ్లు, రప్పలు తదితర ప్రమాణాల శాతాన్ని పరిశీలించి చేతులు దులుపుకొంటున్నారు. చాలా చోట్ల ఏఈవోలు నామమాత్రంగానే ధాన్యం సేకరణలో భాగస్వామ్యం అవుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. పని ఒత్తిడి భారంతో కేంద్రాలకు వెళ్లకుండానే ధాన్యం కొనుగోళ్లకు అనుమతులు ఇస్తున్నారు. మద్దతు ధర తప్పితే సన్న వడ్ల గుర్తింపుపై ఇప్పటివరకు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలులో గ్రెయిన్ కాలిపర్(డయల్ మైక్రోమీటర్) పరికరాన్ని వినియోగించనున్నారు. వీటి కొనుగోలు బాధ్యతను మార్కెటింగ్ శాఖ తీసుకొంది. గింజ పొడవు, వెడల్పు కొలిచేందుకు గ్రెయిన్ కాలిపర్ పరికరాన్ని వినియోగించనున్నారు. నాణ్యతను కూడా ఈ పరికరం గుర్తిస్తోంది. ప్రమాణాలు పాటిస్తేనే ప్రభుత్వ బోనస్ అందనుంది.

నిర్ధారణే సమస్య

33 రకాల సన్నాలకు బోనస్ అందనుండటంతో ధాన్యం సేకరణలో సన్న రకాల నిర్ధారణ సవాలుగా మారింది. గింజ పొడవు 6 మిల్లీమీటర్లు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కంటే తక్కువగా ఉండి.. పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 కన్న ఎక్కువ ఉండకుంటేనే బోనస్ ఇవ్వనున్నట్లు ఆంక్షలు పెట్టారు. తేమ శాతం ఉన్న ధాన్యంలో కొన్ని గింజల పొట్టు తీసి గ్రెయిన్ కాలిపర్ పరికరం సన్న, దొడ్డు రకాలుగా నిర్ధారణ తేల్చుతుంది. వ్యవసాయ శాఖ నిర్ధారిస్తేనే కొనుగోలు చేసి బోనస్ ఇవ్వనున్నారు.

జిల్లాల వారీగా వరి సాగు విస్తీర్ణం (ఎకరాలు లక్షల్లో..)

- కరీంనగర్: 2.76
- పెద్దపల్లి: 2.09
- జగిత్యాల: 3.16
- సిరిసిల్ల: 1.81

ఉమ్మడి జిల్లాలో 6.06 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం, 3.76 లక్షల ఎకరాల్లో సన్న రకం సాగైంది.

వేర్వేరుగా సేకరణ

కేంద్రాల్లో ధాన్యాన్ని వేర్వేరు చోట్ల కొనుగోలు చేస్తారు. అనంతరం సన్నాలు, దొడ్డు రకం ధాన్యం గుర్తించేందుకు సంచులకు రెండు రకాల దారంతో కుట్టే విధానాన్ని పరిశీలిస్తున్నారు. సన్నాలు నిల్వ చేసిన సంచులను ఎరుపురంగు దారంతో కుట్టి.. వాటిపై 'ఎస్' అక్షరం రాస్తారు. దొడ్డు రకానికి పచ్చ రంగు దారం వాడతారు. మిల్లుల్లో వేర్వేరుగా వీటిని భద్రపరుస్తారు. సన్నాల నిర్ధారణలో రాజకీయ పలుకుబడికి తలొగ్గకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిబద్ధత పాటించాలి. అప్పుడే అర్హులైనా రైతులకు బోనస్ దక్కుతోంది.

కేంద్రాలకు పరికరాలను సమకూరుస్తాం

- శ్యామ్‌ప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

సన్నాలకు బోనస్ చెల్లించడంలో నిర్ధారణ కీలకమైంది. ధాన్యం పరిమాణాన్ని నిర్ధారించేందుకు కొత్తగా గ్రెయిన్ కాలిపర్ పరికరాన్ని వాడనున్నాం. కేంద్రాలకు సరిపడా పరికరాలను సమకూర్చనున్నాం. సన్నాల కొనుగోళ్లలో సమస్యలు లేకుండా పర్యవేక్షణ చేస్తాం. నిబంధనలకు లోబడి ఉంటేనే బోనస్ రానుంది.

చిమ్మచీకటిలో ఈత చెట్టు కింద 15 గంటలు

ప్రమాదవశాత్తు పడి రాత్రంతా ఉండిపోయిన గీతకార్మికుడు


ఈత చెట్టు కింద నర్సయ్యగౌడ్

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కల్లు గీసేందుకు ఈత చెట్టు ఎక్కిన గీతకార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి 15 గంటల పాటు నరకయాతన అనుభవించిన ఘటన కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఏగోలపు నర్సయ్యగౌడ్ సోమవారం సాయంత్రం ఈత చెట్టుపై నుంచి కింద పడ్డారు. వెన్నెముక, ఇతర అవయవాలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టూ దట్టమైన చెట్ల పొదలుండటం, ఎవరూ చూడకపోవడంతో నర్సయ్యగౌడ్ లేవలేని స్థితిలో అక్కడే ఉండిపోయారు. భారీ వర్షం కురవడంతో తడుస్తూ అర్తనాదాలు చేసినా ఫలితం లేకపోయింది. భార్య సరమ్మ అల్లూరులో ఉంటున్న కొడుకు ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న నర్సయ్య ఇంటికి రాని విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. రాత్రంతా వర్షానికి తడిసి చలిలో, గాయాల బాధతో విలవిలలాడారు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో అటు వైపు వెళ్లిన గ్రామస్థులకు నర్సయ్యగౌడ్ అరుపులు వినిపించడంతో వెళ్లి చూశారు. గోదావరిఖని ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు, అనంతరం వరంగల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వెన్నెముక, పక్కటెముకలకు బలమైన గాయాలు కావడంతో నర్సయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఎమ్మెస్సీ గణితం ఫలితాలు విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత సెప్టెంబరులో నిర్వహించిన ఎమ్మెస్సీ గణితం(బ్యాక్‌లాగ్) రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in. లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

29 నుంచి బీఫార్మసీ పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే బీఫార్మసీ (సీబీసీఎస్) రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 29 నుంచి ప్రారంభమవుతున్నాయని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 30 నుంచి ప్రారంభమవుతున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గంగులకు మాతృ వియోగం

రాంపూర్(కరీంనగర్), న్యూస్‌టుడే: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తల్లి గంగుల లక్ష్మీనర్సమ్మ మంగళవారం ఉదయం కరీంనగర్‌లో మృతి చెందారు. దుబాయిలో ఉన్న కమలాకర్‌కు ఈ విషయం తెలియడంతో అక్కడి నుంచి బయలుదేరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మేయర్ వై.సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, భారాస నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు తదితరులు లక్ష్మీనర్సమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలు బుధవారం జరగనున్నాయి.


లక్ష్మీనర్సమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మేయర్ సునీల్‌రావు

మంత్రుల సంతాపం

ఆమె మృతికి మంత్రి శ్రీధర్‌బాబు, సియోల్ పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపాన్ని ప్రకటించారు. గంగుల లక్ష్మీనర్సమ్మ అకాల మరణం తమను కలిచి వేసిందన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటనలో సంతాపం తెలిపారు.


లక్ష్మీనర్సమ్మ

కుటుంబ సభ్యులకు కేసీఆర్ సానుభూతి

ఈనాడు, హైదరాబాద్ : గంగుల లక్ష్మీనర్సమ్మ మరణంపై మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ మంగళవారం సంతాపం ప్రకటించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. మాజీ మంత్రులు, కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డిలు కూడా సంతాపం తెలియజేశారు.

మూత్రశాలలు, మరుగుదొడ్లకు తాళాలు

రాజన్న భక్తులకు తిప్పలు

న్యూస్‌టుడే, వేములవాడ



ఆలయ పార్కింగ్ స్థలంలో తాళం వేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లకు తాళాలు వేశారు. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు రూ.10 లక్షలు వెచ్చించి ఆలయ పార్కింగ్ స్థలంలో వీటిని నిర్మించారు. తరవాత వాటి నిర్వహణను ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో భక్తులు బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు పార్కింగ్ స్థలంలోని నల్లాల వద్ద స్నానాలు చేసి స్వామివారి దర్శనానికి వెళ్తున్నారు.


స్నానాల గదులదీ అదే పరిస్థితి

టెండరు పిలిచినా...

ఆలయ పార్కింగ్ స్థలంలో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో భక్తులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆలయ అధికారులు ఈ ఏడాది మార్చిలో టెండర్లు పిలిచి నిర్వహణ బాధ్యతలను ఓ సొసైటీకి అప్పగించారు. మొదట్లో వాటి నిర్వహణ సక్రమంగానే ఉన్నా తరవాత గాలికి వదిలేశారు. నిబంధనల ప్రకారం భక్తులు వచ్చినా, రాకున్నా వాటిని రోజూ తెరిచి ఉంచాలి. ముఖ్యంగా ఆది, సోమ, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారు. పార్కింగ్‌లోని మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు మూసి ఉంచడంతో భక్తుల బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా కంటెయినర్లు

మహా శివరాత్రి సందర్భంగా వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం మూత్రశాలలు, మరుగుదొడ్లకు సంబంధించిన కంటెయినర్లను లక్షలాది రూపాయలు వెచ్చించి పార్కింగ్ స్థలంలోని రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వాటిని వినియోగంలో ఉంచిన దాఖలాలు లేవు. వాటి నిర్వహణను కూడా పట్టించుకోలేదు. దీంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

పార్కింగ్ స్థలంలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులను తెరిచి ఉంచే విధంగా చర్యలు తీసుకుంటాం. టెండరు పిలిచి భక్తులకు ఇబ్బందులు లేకుండా వాటిని వినియోగంలోకి తీసుకొస్తాం. *- వరి నర్సయ్య, శానిటరీ విభాగం అధికారి, రాజన్న ఆలయం*

శ్రీరామసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద రాక కొనసాగింది. 26,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 4 స్పిల్‌వే గేట్ల ద్వారా 12,496 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాలువకు 5 వేలు, కాకతీయ కాలువకు 4 వేలు, ఇతర కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ కలుపుకొని ఔట్‌ఫ్లోను ఇన్‌ఫ్లోతో సమానంగా కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో 80.501 టీఎంసీల నీటి నిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నేడు జమ్మికుంట మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తినే ఈ కేంద్రంలో ఖరీదు చేస్తామన్నారు. నాణ్యత బట్టి ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 నుంచి రూ.7,220కు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. పత్తి పింజ పొడవును బట్టి మద్దతు ధరలో వ్యత్యాసాలు ఉంటాయన్నారు.

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే

? పట్టణంలోని ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. దుర్వాసనతో వినియోగించలేకపోతున్నాం. - **రాజేందర్, రాయికల్**

✓ పారిశుద్ధ్య సిబ్బందిని పురమాయించి శుభ్రపరచేలా చర్యలు తీసుకుంటాం. - **జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్, రాయికల్**

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

? మండలంలోని ఎర్రాపూర్ నుంచి వర్షకొండ గ్రామం వరకు గల పంచాయతీ రాజ్ బీటీ రహదారి గుంతలమయమైంది. - **నరేష్, ఎర్రాపూర్**

✓ టెండర్ల ప్రక్రియ ముగిసింది. త్వరలో రెన్యువల్ బీటీ వేయనున్నారు. - **రమణరెడ్డి, డీఈ పీఆం**

ధర్మపురి, న్యూస్‌టుడే

? ధర్మపురి నుంచి వేకువజామున 5 గంటలకు వెళ్లే హైదరాబాద్ బస్సు సర్వీసు సమయ పాలన పాటించడం లేదు. ఉదయం 5.10 గంటలకు వెళ్లాల్సిన బస్సు ముందుగానే వెళ్లిపోతోంది. **-కస్తూరి రాంకిషన్, ధర్మపురి**

✓ ఈ విషయాన్ని ఇంతకు ముందు కూడా ప్రయాణికులు నా దృష్టికి తీసుకువచ్చారు. తప్పకుండా సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటాం. **- సునీత, జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్**

? ధర్మపురి తహసీల్దార్ కార్యాలయంలో కుటుంబ సభ్యుల వివరాల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వడం లేదు. మంజూరు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. **- ఐ.రామయ్య, ధర్మపురి**

✓ కుటుంబ సభ్యుల వివరాల ధ్రువీకరణ పత్రాలను కేటాయిస్తున్నాం. పత్రాలు కావాల్సిన వారు బ్యాంకు, ఇతర శాఖల ద్వారా లేఖలు పెడితే ఇస్తున్నాం. అందరికీ కేటాయించడం సాధ్య పడదు. **- కృష్ణ చైతన్య, తహసీల్దార్, ధర్మపురి**

తిండి లేక స్పృహ తప్పిన యాచకుడు

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు ప్రాంతంలో బిచ్చమెత్తుకుంటే డబ్బులు బాగా దొరుకుతాయని చెప్పి ఓ వ్యక్తి 80 ఏళ్ల వృద్ధుడిని తీసుకొచ్చి వదిలేసి వెళ్లగా తిండి లేక అతడు స్పృహ కోల్పోయిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా ఇందారం గ్రామానికి చెందిన వృద్ధుడు మారినేని పోచయ్య, అదే జిల్లాకు చెందిన తిరుపతి వారి ప్రాంతాల్లో యాచించేవారు. కొండగట్టులో యాచిస్తే భక్తుల నుంచి ఎక్కువ డబ్బులు వస్తాయని వృద్ధుడికి తిరుపతి చెప్పాడు. సోమవారం సాయంత్రం కొండగట్టు దిగువ ప్రాంతంలోని మెహర్‌బాబా కేంద్రం సమీపంలోని జగిత్యాల - కరీంనగర్ జాతీయ రహదారి పక్కన వదిలేసి వెళ్లాడు. తిండిలేక వృద్ధుడు మంగళవారం స్పృహతప్పి పడిపోయాడు. మల్యాల బ్లూకోల్ట్స్ పోలీసులు అతడిని చికిత్స కోసం 108లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

'గుండెపోటుతోనే మృతి'

వెల్గటూరు, న్యూస్‌టుడే: ముక్కట్రావుపేటకు చెందిన మేకల రాజయ్య గుండెపోటుతో మృతి చెందినట్లు పోస్టుమార్టం నివేదికలో ప్రాథమికంగా వైద్యులు నిర్ధారించినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. మద్యానికి బానిసైన రాజయ్య సోమవారం తెల్లవారు జామున మృతి చెంది ఉండటంతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టంలో గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినప్పటికీ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు వివరించారు.

పైడిపల్లిలో విషాదం

వెల్గటూరు, న్యూస్‌టుడే: కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ మృతితో స్వగ్రామం పైడిపల్లిలో విషాదం నెలకొంది. నర్సమ్మ 2004-09 వరకు పైడిపల్లి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామ పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు. అప్పట్లో ఉపాధ్యాయుల కొరత ఉండటం వల్ల పాఠశాలలో ప్రైవేటుగా విద్యావాలంటీర్లను సొంతంగా నియామకం చేసి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేశారు. ఆమె మృతి పట్ల మాజీ ఎంపీపీ గంగుల అశోక్, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు గంగుల పద్మ, నగేష్, రవిందర్, రాయమల్లు, జనార్దన్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

అత్యాచార ఘటనపై అధికారుల ఆరా!

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల మండలంలోని ఓ గ్రామంలో అయిదు రోజుల క్రితం బాలికపై సమీప బంధువైన యువకుడు అత్యాచారానికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై జిల్లా ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. బాలిక బంధువులు ఠాణా సమీపంలో పంచాయితీ నిర్వహించినట్లు.. యువకుడి కుటుంబ సభ్యులు అధికారులకు, పంచాయితీ పెద్దలకు డబ్బులు ముట్టజెప్పినట్లు అధికారుల విచారణలో తేలినట్లు సమాచారం. ఈ విషయమై ఇంటెలిజెన్స్ అధికారులు తమ దర్యాప్తు నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిసింది.

మద్యం మత్తులో కారు డ్రైవర్ బీభత్సం

రహదారి పక్కన ఉన్న ఒకరికి తీవ్ర గాయాలు

వేములవాడ, న్యూస్‌టుడే: మద్యం మత్తులో డ్రైవర్ అతి వేగంగా కారును నడిపి బీభత్సం సృష్టించిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్-సిరిసిల్ల ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా పొలాస గ్రామానికి చెందిన ప్రశాంత్ భార్యతో గొడవ పడి తన ముగ్గురు పిల్లలతో కారులో సిరిసిల్ల వైపు వెళ్తున్నాడు. మద్యం మత్తులో కారు నడుపుకుంటూ వచ్చి వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ వద్ద అదుపు తప్పి బీభత్సం సృష్టించాడు. దీంతో రహదారి పక్కన నిలిపిన మూడు ద్విచక్ర వాహనాలతో పాటు ఓ ఆటోను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వేములవాడ మండలంలోని శాభాష్‌పల్లికి చెందిన పరశురాములుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. కారులోని ముగ్గురు చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా కారు డ్రైవర్ వేములవాడ గ్రామీణ మండలంలోని వట్టెంల శివారులో ఓ శునకాన్ని ఢీకొట్టడంతో అది మృతి చెందగా దాన్ని స్థానికులు కారు డిక్కీలో వేసి పంపినట్లు సమాచారం. సంఘటన స్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. కారును సీజ్ చేసి దెబ్బతిన్న ఇతర వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

పథకాల అమలు ఎలా ఉంది?

ముగిసిన కేంద్ర బృందం పరిశీలన


నక్కలపేటలో మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం పరిశీలకులు

న్యూస్‌టుడే, ధర్మపురి: జిల్లాలో గ్రామీణాభివృద్ధి సంస్థ 2024 - 25 సంవత్సరానికి వివిధ పథకాలకు సంబంధించిన పనుల అమలు తీరుతెన్నులను పరిశీలించేందుకు జాతీయస్థాయి పర్యవేక్షణ (ఎన్ఎల్ఎం) బృందం సభ్యుల పరిశీలన ముగిసింది. ఈ నెల 14న ప్రారంభమైన బృందం సభ్యుల పరిశీలన మంగళవారంతో ముగిసింది. ఈ బృందం సభ్యులు జాతీయ ఉపాధి హామీ పథకం సహా వివిధ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధానంగా గ్రామాల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, ఐకేపీ పథకాల అమలు తీరు తెన్నులను తెలుసుకున్నారు. జిల్లాలో ధర్మపురి మండలంలోని ఆకుసాయిపల్లె, పెద్ద నక్కలపేట, బొదరి నక్కల చెరువు గూడెం, గొల్లపల్లి మండలంలోని దట్నూర్, చిల్వాకోడూర్, లొత్తునూర్, ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, జగిత్యాల మండలంలోని మోతె, ధరూర్‌లలో పర్యటించారు. ఉపాధి హామీ పనులు, కూలీలకు వేతనాల చెల్లింపులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో స్వశక్తి మహిళలకు రుణాల చెల్లింపులు, మహిళా సంఘాల పనితీరుపై ఆరా తీశారు. క్షేత్ర స్థాయిలో చూసిన పనుల ప్రగతి, లోపాలు, ప్రజల అభిప్రాయాలను క్రోడీకరించి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు



జగిత్యాల గ్రామీణ మండలం పొలాస ఎక్స్‌రోడ్ నుంచి గుల్లపేట వెళ్లే రహదారిలో ఇరువైపులా చెట్ల కొమ్మలు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అనంతారం వంతెన పనులు కొనసాగుతుండగా బస్సులు, ఇతర వాహనాలు ఇదే మార్గంలో వెళుతున్నాయి. చెట్ల కొమ్మల కారణంగా దారి కనిపించక ఇబ్బంది పడుతున్నామని, కొమ్మలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం**

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


రామన్నపేటలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల మండలంలోని రామన్నపేట, ముత్యంపేట, మల్యాల మార్కెట్ యార్డు, తాటిపల్లి, కొండగట్టు, బల్వంతాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు మునీందర్, ఎంపీడీవో స్వాతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనందరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు రాంలింగారెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు బత్తిని మల్లీశ్వరి, ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో మొక్కజొన్న కేంద్రం..

మల్లాపూర్: మల్లాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఛైర్మన్ వెంపేట నర్సారెడ్డి ప్రారంభించారు. మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలత, వైస్ ఛైర్మన్ ఇట్టేడి నారాయణరెడ్డి, డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా సేకరించాలి


పైడిమడుగులో కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డా.సంజయ్

కోరుట్ల: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరించాలని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం కోరుట్ల మండలం నాగులపేట, సంగెం, గుంలాపూర్, మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి, మాదాపూర్, పైడిమడుగు, జోగిన్‌పల్లి, కల్లూర్, సర్పరాజ్‌పల్లె, ధర్మారం, అయిలాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రుణమాఫీ, రైతు భరోసాపై ప్రభుత్వం మోసం చేయడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దారిశెట్టి రాజేశ్, తోట నారాయణ, చీటి వెంకట్రావ్, పీఏసీఎస్ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పతకాలు సాధించడం అభినందనీయం


పతకాలతో విద్యార్థులు

జగిత్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఐ. ఐఖీల్ నాయక్ 400 మీ. పరుగు పందెంలో, ఎం.డి.సోహెల్ 1500 మీ. పరుగు పందెంలో బంగారు పతకం, జి.అభిరామ్ 5 కి.మీ. నడక పోటీలో రజతం సాధించి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ప్రిన్సిపల్, డాక్టర్ దాసరి రాజేందర్, వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్, పీడీ అంజయ్య, వార్డెన్‌లు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


బాలికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సారంగాపూర్: ఉమ్మడి జిల్లా స్థాయి అండర్- 17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన కోనాపూర్ విద్యార్థిని జి.వర్షిణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, పీడీ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, తదితరులు విద్యార్థినిని అభినందించారు.

జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి కళోత్సవాలకు..


అనూషను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామన్నపేట, మల్యాల: మల్యాల మండలం రామన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సంకుర్తి అనూష ఇటీవల జగిత్యాలలో జరిగిన జిల్లాస్థాయి కళోత్సవాల్లో పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ ఏకపాత్రాభినయం ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. విద్యార్థినిని ఉపాధ్యాయులతోపాటు గ్రామస్థులు మంగళవారం సత్కరించారు. నాయకులు బొడిగె సురేశ్, కోరుట్ల రవీందర్, రియాజుద్దీన్, మహిపాల్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నారాయణ, మల్లయ్య, ప్రవీణ్, పీఈటీ ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

గ్రామీణ పరిశ్రమల అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డీజీ ప్రసాద్‌శర్మ

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని వీకేబీ భవనంలో గ్రామోద్యోగ్ వికాస్ యోజన ఆధ్వర్యంలో గ్రామీణ పరిశ్రమలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరిశ్రమలతో సాధికారత సాధించడం కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేవీఐసీ సహాయ డైరెక్టర్ డీజీ ప్రసాద్‌శర్మ అన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల స్థాపన, నిర్వహణ, ఆదాయం తదితరాలపై అవగాహన పెంపొందించారు. కేవీఐసీ ప్రతినిధులు ఎన్.లతాదేవి, అంజనాదేవి, జిల్లా బీసీ సంక్షేమాధికారి సాయిబాబా, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు టీవీ సత్యం, సంకోజి రమణ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

సారంగాపూర్, న్యూస్‌టుడే: వర్షాలకు నష్టపోయిన పంటలను రెవెన్యూ, వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. బీర్‌పూర్ మండలంలోని తాళ్లధర్మారం, రేకులపల్లెలో ఈదురు గాలులతో వర్షం కురవడంతో పంట పొలాలు నేలకొరిగాయి. ఆయా గ్రామాల్లో దాదాపుగా 160 ఎకరాల్లో వరి పంట, 80 ఎకరాల వరకు పత్తి పంట నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లా వ్యవసాయాధికారి రాంచందర్, ఏడీఏ తిరుపతినాయక్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణాధికారులు, తదితరులు పాల్గొన్నారు. సారంగాపూర్ సహకార సంఘ పరిధిలోని ఎరువుల నిలువలను తనిఖీ చేశారు. విస్తరణాధికారులు వెంకటేశ్, ఆంజనేయులు, సీఈవో లైసెట్టి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ శిబిరానికి విద్యార్థులు


విద్యార్థులకు వివరిస్తున్న శిక్షకుడు

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: హిమాచల్ ప్రదేశ్‌లో సోమవారం ప్రారంభమైన నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్‌లో శాతవాహన వర్సిటీ నుంచి 10 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పడాల తిరుపతి తెలిపారు. ఈ నెల 31 వరకు క్యాంపు జరుగనుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన


రాయికల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జగిత్యాల, రాయికల్ పట్టణం, బీమారం, కొడిమ్యాల, వెల్గటూరు: పెండింగ్ బిల్లులు, డీఏలు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయులు అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. జీపీఎఫ్, సంపాదిత సెలవు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సప్లిమెంటరీ వేతనాల బిల్లులు ఏడాది దాటినా మంజూరు చేయడం లేదని.. పెండింగ్‌లో ఉన్న అయిదు డీఏలు చెల్లించాలని కోరారు. తపస్ రాష్ట్ర సహా అధ్యక్షుడు అయిల్నేని నరేందర్ రావు, జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, రాష్ట్ర బాధ్యులు రాజేంద్రప్రసాద్, మహిపాల్‌రెడ్డి, శ్రీధర్, రామక్రిష్ణ, సురేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వెంకట్రావుపేట, మేడిపల్లి మండలం కొండాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు ధర్మాగ్రహ దీక్ష నిర్వహించారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి ప్రసాద్‌రావు, మండల శాఖ అధ్యక్షుడు గడ్డం తిరుమల్‌రెడ్డి, రమేశ్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు. కొడిమ్యాలలో తపస్ రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకటరమణారావు, సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి, భూపతిరెడ్డి, సురేశ్, ప్రవీణ్‌రెడ్డి, రాజన్న, వెంకటేశం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. ముత్తునూరులో ప్రధానోపాధ్యాయురాలు విమలాదేవి, నర్సింగం, రాజేశ్వర్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, జయశ్రీ, సాగర్, అపర్ణ, ప్రవళిక పాల్గొన్నారు.


ముత్తునూరులో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని వినతి

గొల్లపల్లి: గొల్లపల్లిలోని శ్రీ కల్యాణ రామచంద్రస్వామి ఆలయం వద్ద విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆలయ ధర్మకర్త అనంతుల భూమయ్య ఆధ్వర్యంలో ఎంపీడీవో రాంరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. తిరునహరి సత్యనారాయణ, ఆవుల వెంకటేష్, వేల్పుల రాము, కాల్వ శ్రీనివాస్, మారం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

సారంగాపూర్, న్యూస్‌టుడే: తాళ్లధర్మారం ప్రాథమికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయుడు గణేశ్ విజ్ఞప్తి మేరకు ధర్మపురికి చెందిన పలువురు దాతలు రూ.25 వేల విలువ గల స్మార్ట్ టీవీని అందజేశారు. ఎంఈవో నాగభూషణం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయిని రజిత, పీఆర్టీయూ అధ్యక్షుడు సంగకుమార స్వామి, తదితరులు పాల్గొన్నారు.



కోతులతో తీవ్ర ఇబ్బందులు

ధర్మపురి గ్రామీణం, న్యూస్‌టుడే: కోతులతో నేరెల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై గుంపులుగా ఉండటంతో వాహనాలపై వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లల్లోకి దూరి దాడులు చేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మండల విద్యాధికారిగా బాధ్యతల స్వీకరణ

పెగడపల్లి: మండల విద్యాధికారిగా నామాపూర్ జడ్పీఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులోచన దేవి పూర్తి అదనపు బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. మండలంలో విద్యా సంస్థలు సక్రమంగా పనిచేసేలా, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు కృషి చేస్తానని ఆమె వివరించారు.

నిబంధనలు తప్పనిసరి

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: ప్రైవేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన డాక్యుమెంటేషన్‌లోని వైద్యులు, సిబ్బందిని తరువాత మార్చినప్పుడు తప్పనిసరిగా వైద్యశాఖకు సమాచారం అందించాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. జగిత్యాలలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందిని మార్చిన అంశంపై నిర్వాహకులను హెచ్చరించి నిబంధనల ప్రకారం నడచుకోవాలన్నారు. డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

హామీలు నెరవేర్చాలి

కోరుట్ల: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ నేత దాసర్ల శ్రీశైలం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వరకు చేపడుతున్న పాదయాత్రలో మంగళవారం భాస్కర్ పాల్గొని మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు. కృష్ణ ముదిరాజ్, గుండెటి రవి, బాలచందర్, నరేశ్, శ్రీనివాసులు, మారుతి, లక్ష్మణ్, దత్తు, వినోద్, విల్లాస్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కోరుట్ల: కల్లూర్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే డా.సంజయ్ మంగళవారం భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ నుండి రూ.10 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మాజీ సర్పంచి అంజయ్య, రాకేశ్, గంగాధర్, జగన్‌రావు, అంజాగౌడ్, మల్లయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: అయిలాపూర్, సంగెం, కల్లూర్, యూసుఫ్‌నగర్ గ్రామాల్లోని పలు ఆలయాల్లో అభివృద్ధి పనులకు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పన్నాల అంజిరెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. వైస్ ఛైర్మన్ పుల్లూరి వెంకటేశ్‌గౌడ్, సత్యనారాయణ, వెంకగౌడ్, రాజం, సాయిరెడ్డి, శంకర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, తుక్కారాం, రమేశ్, లక్ష్మణ్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

కోరుట్ల: మాదాపూర్‌కు చెందిన కె.భూమయ్య చికిత్స నిమిత్తం రూ.2 లక్షల విలువ గల ఎల్‌వోసీని ఎమ్మెల్యే డా. సంజయ్ మంగళవారం అందజేశారు. మాజీ సర్పంచి దారిశెట్టి రాజేశ్, పీఏసీఎస్ ఛైర్మన్ ఆదిరెడ్డి, నారాయణ, వెంకట్రావ్, భాస్కర్‌రెడ్డి, భూమయ్య పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

మెట్‌పల్లి: మెట్‌పల్లిలో ఇటీవల హోంగార్డు సుబ్బరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డిలు మంగళవారం పరామర్శించారు. మెట్‌పల్లి పోలీసుల తరపున రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు.

భాజపా నాయకుడి సాయం

మల్యాల: మల్యాల మండల కేంద్రానికి చెందిన జిల్లెల్ల రమేశ్ భార్య మీనాక్షి (35) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. భాజపా మండల అధ్యక్షుడు నేరెల్ల శ్రావణ్‌కుమార్ రూ.20 వేలు సాయం అందించారు. మరోవైపు ఏడేళ్ల కుమారుడు తల్లి చితికి నిప్పంటించడం స్థానికులను కలిచి వేసింది.

పోషకాహారం అందించాలి

ధర్మపురి: అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, సిబ్బంది ప్రతి నెలా పిల్లలకు పోషకాహారం సక్రమంగా అందించాలని జిల్లా సంక్షేమశాఖాధికారి డాక్టర్ బి.నరేష్ అన్నారు. ధర్మపురి ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బి.వాణిశ్రీ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాలు- నియామకాలు

మల్యాల: సీఐటీయూ మల్యాల మండల అధ్యక్షుడిగా కోరెపు మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా ముప్పార పోచయ్య, ఉపాధ్యక్షుడిగా గసికంటి శ్రీను, కోశాధికారిగా బోనాల మల్లేశం, ప్రచార కార్యదర్శిగా మల్యాల మహేశ్, గౌరవ అధ్యక్షురాలుగా మ్యాక దేవమ్మ ఎన్నికయ్యారు.

దేవస్థానంలో పురాణ ప్రవచనాలు 24న

ధర్మపురి: దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 24న బాల బ్రహ్మానంద సరస్వతీ స్వామి (నైమిశారణ్యం పీఠాధిపతి) ప్రవచనం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై శ్రీ లక్ష్మీనరసింహ పురాణం, మహత్యంపై ప్రవచనం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఓటరు నమోదుపై అవగాహన

జగిత్యాల ధరూర్‌క్యాంపు: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఓటర్లుగా నమోదు చేసుకునే అంశంపై జగిత్యాలలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, పెన్షనర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురిని ఓటర్లుగా నమోదు చేశారు. హరి అశోక్‌కుమార్, ప్రకాశ్‌రావు, విఠల్, బోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేయించండి

రాయికల్: మూడు నెలలు పైబడిన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని అదనపు పశు వైద్యాధికారి నరేశ్‌రెడ్డి సూచించారు. అల్లీపూర్ గ్రామంలో సుమారు 370 పశువులకు మంగళవారం టీకాలు వేసినట్లు తెలిపారు. రవీందర్, రమేశ్ షేక్ అహ్మద్, పోచయ్య పాల్గొన్నారు.

గొల్లపల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. మనోహర్ సూచించారు. రాఘవపట్నంలో నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పశువైద్యాధికారి రవీంధర్, సిబ్బంది పాల్గొన్నారు.